ప్రజాశక్తి

బుధవారం 26 నవంబర్ 2025

5

పార్వతీపురం మన్యం

ఇవిఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద గల ఇవిఎం గోదామును జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీలో భాగంగా మంగళవారం ఆయన గోదాములను సందర్శించి అక్కడ పరిస్థితిని గమనించారు. గోదాములకు వేసిన సీళ్లను ఇవిఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిష్టరులో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. గోదాముల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశిస్తూ, ఏర్పాట్లపై పరిశీలించి అధికారులకు పలు సూచనలు, మార్గదర్శకాలు జారీ చేశారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.హేమలత, తహశీల్దార్ ఎం.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పండుగలా పుస్తక మహోత్సవం

- పులకించిన పుస్తక ప్రియులు
- కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- ఆకట్టుకున్న ప్రదర్శనలు

ప్రజాశక్తి - పార్వతీపురం

మన్యం జిల్లా పుస్తక మహోత్సవం పండగ వాతావరణంలో ప్రారంభమైంది. పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం నిర్వహించిన ఈ వేడుకలను కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు ప్రచురణ సంస్థలు ఏర్పాటు చేసిన వేలాది పుస్తకాలను చూసి పుస్తక ప్రియుల మనస్సు పులకించింది. సాహిత్య సభలు, కవి సమ్మేళనాలు సాహిత్య ప్రియులను ఓలలాడించాయి. చిన్నారుల నృత్య ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా జన విజ్ఞాన వేదిక ఏర్పాటు చేసిన సైన్సు ప్రయోగాలు అందరినీ అలరింపజేశాయి.

విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఎపి సాంస్కృతికశాఖ, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పుస్తక మహోత్సవాన్ని ఏర్పాటు చేవారు. పట్టణానికి చెందిన ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరు నాయుడు, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ మంచుపల్లి శ్రీరాములు, పుస్తక మహోత్సవం కన్వీనర్ ఎస్. మురళీమోహన్ రావుతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్ ప్రభాకర్ రెడ్డి, ఎస్పి ఎస్వి మాధవరెడ్డి పుస్తక ప్రదర్శనను తిలకించారు. హాజరైన శ్రీజన్ పాఠశాల విద్యార్థినులతో కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి ముచ్చటించారు. మన్యం గడ్డపై తొలిసారి పుస్తక మహోత్సవం ప్రారంభం కావడంతో సాహితీ ప్రియులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల ప్రదర్శన చూసి పరవసించి పోయారు. విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక, సాహితీ రంగాలకు చెందిన పుస్తకాలు అందుబాటులో ఉండడంతో ఆనందం వ్యక్తం చేశారు. అన్ని రంగాలకు చెందిన పుస్తకాలు ఒకే చోట లభ్యమవడంతో వారి సంతోషానికి అవధులు లేకుండా పోయింది. వంద ప్రచురణ సంస్థలకు చెందిన లక్ష పుస్తకాలు ఈ ప్రదర్శన లో అందుబాటులో ఉన్నాయి. పుస్తకం నుంచి పూర్తిగా దూరమై మనుషులు స్మార్ట్ ఫోన్లకు అతుక్కుపోతున్న తరుణంలో ఇలాంటి పుస్తక మహోత్సవం ప్రారంభించిన తొలిరోజే విశేష స్పందన లభించింది.

సాహితీ వేత్తలకు పుట్టినిల్లు : కలెక్టర్

పుస్తక మహోత్సవాన్ని ప్రారంభించిన కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ సాహితీవేత్తలకు పుట్టినిల్లు మన్యం జిల్లా అని పేర్కొన్నారు. ఇక్కడ ఎక్కువ మంది కవులు, సాహితీవేత్తలు, రచయితలు ఉండటం గర్వకారణమని అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాకు సహజ సిద్ధమైన సాహిత్య, సాంస్కృతిక వాతావరణం ఉందని, ఇక్కడ గొప్ప కవులు, రచయితల లక్షణాలు మెండుగా ఉన్నాయని అన్నారు. జిల్లాలోని కవులు, రచయితలు, కళాకారులు, అన్ని రంగాలకు చెందిన వారి వివరాలను సేకరించి ఒక డైరీని రూపొందిస్తున్నామని తెలిపారు. దీనివల్ల భవిష్యత్తులో వారికి ఆహ్వానాలు పంపడానికి, వారిని కలుపుకుపోవడానికి వీలవుతుందని అన్నారు. రాబోయే 10 రోజుల పాటు జరిగే ఈ పుస్తక మహోత్సవాన్ని, సాహిత్య సభలను ప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం థింసా నృత్యం చేసిన గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులను ఎస్పితో కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు.

పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

నృత్యం చేస్తున్న మహిళా ఉపాధ్యాయులు

అలరించిన థింసా నృత్యం

విప్లవ గాయకుడు వంగపండు ప్రసాదరావు, రచయిత బోనం నాగభూషణం, సినీ గేయ రచయిత గణేష్ పాత్రో పేరిట ఏర్పాటు చేసిన సాహిత్య, సాంస్కృతిక వేదికపై జిల్లా కలెక్టర్, ఎస్పి, కవి, రచయిత గంటేడ గౌరు నాయుడు సహా అతిథులు ఆశీనులయ్యారు. గిరిజన మహిళా ఉపాధ్యాయులు చేసిన థింసా నృత్యం ఆహూతులను ఆకట్టుకుంది. వీటితో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఎస్పి ఎస్.వి.మాధవ్ రెడ్డి మాట్లాడుతూ అందరిలో ఆలోచన శక్తి పెరగాలంటే పుస్తక పఠనం తప్పనిసరి అని అన్నారు. పిల్లలకు పుస్తక పఠనం అలవాటు చేయడం వల్ల వారిలో హేతుబద్ధమైన ఆలోచన పెరుగుతుందని, మంచి, చెడులను ఆలోచించే శక్తి వస్తుందన్నారు. ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరు నాయుడు, ప్రముఖ కవి, కళాకారుడు రౌతు వాసుదేవరావు, కేంద్ర సాహిత్య ఆవార్డు గ్రహీతలు బెలగాం భీమేశ్వరరావు, నారంశెట్టి ఉమామహేశ్వర రావు, పక్కి రవీంద్రనాథ్, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ పాల్గొని పుస్తక పఠనం ద్వారా లభించే సృజనాత్మకతను వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, సాహితి లహరి మంచుపల్లి శ్రీరాములు, జిల్లా రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎం.శ్రీరాములు, డివిఇఒ వై.నాగేశ్వరరావు, సామాజిక వేత్త జట్టు పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానామృత సాగరంలా పుస్తక మహోత్సవం

పార్వతీపురంలో ప్రారంభమైన పుస్తక మహోత్సవం జ్ఞానామృత సాగరంలా ఉంది. ఒకే చోట వంద ప్రచురణ సంస్థల పుస్తకాలు దొరకడంతో పుస్తక దాహార్తి తీరింది. మనిషి మేధస్సు వికసించాలన్నా, సృజనాత్మకత బయటకు రావాలన్నా పుస్తకం చాలా అవసరం. ప్రతి ఇంటిలో వంట గది వున్నట్లే పుస్తకాలకు ఓ గది వుండాలి. పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలి. స్మార్ట్ ఫోన్ వినియోగంలోకి వచ్చిన తర్వాత పుస్తకాలను దూరం పెట్టారు. గ్రంథాలయం లేని ఊరు వెనుకబడినట్లే పెద్ద పెద్ద మేడలున్నంత మాత్రాన ఆ ఊరు అభివృద్ధి చెందినట్లు కాదు.

గంటేడ గౌరు నాయుడు, కవి, రచయిత

గొప్ప అనుభూతి ఇచ్చింది

మన్యం పుస్తక మహోత్సవంలో వేలాది పుస్తకాల ప్రదర్శనతో పాటు అమ్మకాలు చేపట్టడం గొప్ప అనుభూతి ఇచ్చింది. స్మార్ట్ ఫోన్లలకు అతుక్కుని పోతున్న సమయంలో ఇలాంటి పుస్తక మహోత్సవం నిర్వహించడం హర్షణీయం.

భాస్కరరావు, రిటైర్డు ఉపాధ్యాయుడు.

ఆనందంగా ఉంది

ఒకే చోట వేలాది పుస్తకాలు అందుబాటులో వుండడం చాలా ఆనందంగా ఉంది.అన్ని రకాల పుస్తకాలు ఇక్కడ లభించడం గొప్ప విషయం.

వైష్ణవి, విద్యార్థిని

గాజు పెంకులపై నిల్చొన్న విద్యార్థి

ఆకట్టుకున్న జెవివి ప్రదర్శనలు

మన్యం పుస్తక మహోత్సవం లో భాగంగా తొలిరోజు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన మూఢనమ్మకాలపై నిర్వహించిన పలు ప్రదర్శనలు విద్యార్థులను విశేషం గా ఆకట్టుకున్నాయి.గాజు పెంకులపై విద్యార్థులు చెప్పు లేకుండా నడవడం, మేకులు వున్న కుర్చీలో కూర్చోవడం వంటి ప్రయోగాలు విద్యార్థుల సృజనాత్మకత వెలికి తీయడానికి దోహదపడ్డాయి .

ప్రారంభ సభలో మాట్లాడుతున్న కవి గౌరునాయుడు

ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

లింగ వివక్ష లేకుండా చర్యలు

సమాజంలో స్త్రీ, పురుషులిద్దరూ సమానమే : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

సమాజంలో స్త్రీ, పురుషులిద్దరూ సమానమేనని, ఈ విషయం అందరికీ అర్థమయ్యేలా విస్తృత ప్రచారం చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. జెండర్ సమానత్వం కోసం జాతీయ ప్రచారంలో భాగంగా మెప్మా, డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో ర్యాలీ మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి ప్రారంభమైన ర్యాలీ స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్త్రీ, పురుషుల సమానత్వంపై జాతీయ స్థాయిలో ప్రభుత్వం ఒక ప్రచార కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. సమాజంలో స్త్రీ పురుషులు ఇద్దరూ సమానమేనన్న భావన కల్పించడానికి జిల్లాలో పటిష్టంగా అమలు చేస్తున్నామని తెలియజేసేందుకు ర్యాలీని చేపట్టినట్లు చెప్పారు. దీని కోసం మనమంతా జిల్లాస్థాయిలో ఒక ప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. అధికారులు కూడా వివక్ష ఉన్నచోట వారికి అవగాహన కల్పించి చైతన్యపరచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు అభినందనలు తెలియజేస్తూ, మీలాంటి వారి వల్లనే కార్యక్రమాలు విజయవంతం అవుతున్నాయని మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్తూ స్త్రీ, పురుషులు సమానమేనని సమాజానికి సందేశం అందించాలని అభిలాషించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి, మెప్మా పీడీ డి.కృష్ణారావు, ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ టి.జగన్మోహనరావు, మహిళలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి : మంత్రి

ప్రజాశక్తి - పార్వతీపురం

దక్షిణ అండమాన్ సముద్రంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం పశ్చిమ వాయుదిశగా కదులుతూ తీవ్ర వాయుగుండంగా మారునుందని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ముందస్తు జాగ్రత చర్యలతో తక్షణం సన్నద్ధం కావాలని సూచించారు. తుపాను తీవ్రత పేరిగే అవకాశం ఉండడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని, క్షేత్ర స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు పర్యటించి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. వరి కోతలు కోసిన రైతులు పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ధాన్యాన్ని జాగ్రత్త చేసుకోవాలని, రైతాంగానికి ఉచితంగా టార్పలిన్ పట్టాలను ప్రభుత్వం తరపున సరఫరా చేస్తున్నామని అన్నారు. వాటిని జిల్లా యంత్రాంగం రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాయలసీమ ప్రాంతంతో పాటు ఉత్తరకోస్తా అంతటా ఈ ప్రభావం ఉంటుందని, ఇప్పటికే విపత్తుల నిర్వహణ సంస్థ నుంచి హెచ్చరికలు వస్తున్న నేపథ్యంలో ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులు గమనించి రైతులు సమాచారం అందివ్వాలని చెప్పారు. అలాగే మత్స్యకారులు వేటకు వెళ్లరాదని వాతావణ శాఖ హెచ్చరిక జారీ చేసిందని, ఇప్పటికే చేపలవేటకు వెళ్లిన మత్స్యకారులు ఒడ్డుకు చేరుకోవాని సూచించారు. అలాగే విపత్తు నిర్వహణ బృందాలు పరిస్థితులను పరిశీలిస్తూ ఉండాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు, రైతాంగానికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని చెప్పారు.

కంబర వలసలో వైద్య శిబిరం

వీరఘట్టం :మండలంలోని నడుకూరు సచివాలయ పరిధి కంబరవలసలో మంగళవారం స్థానిక వైద్యాధికారి ఎం.సాయికుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణీలు, బాలింతలు, రక్తపోటు, మధుమేహ, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ఎన్నాళ్లు ఇలా!

ఒడిశా అధికారుల అరాచకాలతో విసుగు చెందుతున్న గిరిజనులు

భయాందోళనలో ఉద్యోగులు

ప్రజాశక్తి - సాలూరు

ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, స్థానిక గిరిజనులు అధికారుల నిర్లక్ష్యానికి, సరిహద్దు రాజకీయాలకు బలైపోతున్నారు. తమను ఆంధ్రా ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందనే ఆవేదన, ఆగ్రహం సరిహద్దు ప్రజల్లో, సిబ్బందిలో వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరిష్కారం కాని సరిహద్దు వివాదాల కారణంగా కింది స్థాయి ఉద్యోగులు నిత్యం ఒడిశా పోలీసుల ప్రతిఘటనల మధ్య విధులు నిర్వహించాల్సిన వస్తుండగా, స్థానిక గిరిజనులు భద్రతకు నోచుకోక నిత్య భయంతో జీవిస్తున్నారు.

ఉద్యోగులపై దౌర్జన్యం

మండలంలోని పగులు చెన్నూరు పంచాయతీ ఎగువ మెండంగిలో రైతన్న మీకోసం కార్యక్రమం కోసం మంగళవారం స్థానిక సచివాలయ, వ్యవసాయ సిబ్బందిని ఒడిశా పోలీసులు, అధికారులు అడ్డుకున్నారు. సర్వే నిమిత్తం వచ్చిన అధికారులతో ఈ ప్రాంతం ఒడిశా ఆధీనంలో ఉందని, ఇక్కడ ఆంధ్రా ప్రభుత్వ కార్యకలాపాలు, సేవలు అందించకూడదని వారు హుకుం జారీ చేశారు. అంతటితో ఆగకుండా వ్యవసాయ సిబ్బంది నిర్వహించిన సర్వే పుస్తకాన్ని లాక్కొని, అందులోని రైతుల వివరాలు ఉన్న పేజీలను చింపి పట్టుకుపోయారు. ఇక్కడి డేటాను ఆంధ్రా అధికారులు తమ దగ్గర ఉంచుకోవడానికి వీల్లేదని హెచ్చరించారు. ప్రభుత్వ సేవలందించడానికి వెళ్లిన ఉద్యోగులపై ఈ స్థాయిలో దౌర్జన్యం జరిగినా ఆంధ్రా అధికారులు మౌనం వహించడంపై ఉద్యోగ సంఘాలు, స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఏం చేయలేక సిబ్బంది ఇక్కడ నుండి వెనుతిరగక తప్పలేదు.

రికార్డుల్లో పేజీలను చించివేస్తున్న ఒడిశా అధికారులు

ఎన్నికలప్పుడే పలకరింపు : గిరిజనుల ఆవేదన

సరిహద్దు గ్రామాల్లో ఒడిశా పోలీసుల బెదిరింపులు, స్థానిక అధికారుల ఘర్షణ వాతావరణం నిత్యకృత్యంగా మారినా, ఆంధ్ర పోలీసులు, అధికారులు మాత్రం కనీసం ఈ ప్రాంతాల్లో పర్యటించి తమకు ధైర్యం చెప్పిన దాఖలాల్లేవని స్థానిక గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రా సిబ్బంది ఈ ప్రాంతాలకు వచ్చి ఏ పని చేయాలన్నా రభస చేయడం ఒడిశా అధికారులకు నిత్యకృత్యంగా మారిపోయిందని, తమకు భద్రత కల్పించాల్సిన ఆంధ్రా పోలీసులు ఎందుకు ఈ ప్రాంతాల్లో పర్యటించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఎప్పుడో ఎన్నికల సమయంలో స్పెషల్ పోలీసులను పెట్టుకొని ఓట్లు వేయించుకోవడం తప్ప, తమ భద్రత ప్రభుత్వాలకు ఏ మాత్రం పట్టదా అని స్థానిక గిరిజనులు నిలదీస్తున్నారు. పగులుచెన్నూరు గ్రామస్తులు స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసినా కనీసం స్పందించకపోవడం ఆంధ్రా అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని విమర్శించారు. సరిహద్దు సమస్యలు ఉత్పన్నమైనప్పుడు ఉద్యోగులను, ప్రజలను ఒంటరిగా వదిలివేసి ఒడిశా ఘర్షణలకు అవకాశం కల్పిస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రతినిత్యం సరిహద్దుల్లో నెలకొన్న ఈ ఘర్షణ ఉద్రిక్త పరిస్థితులను ఆంధ్రా-ఒడిశా ప్రభుత్వాలు తక్షణమే పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని, అప్పటి వరకు ఈ ప్రాంతంలో ఉండే గిరిజన ప్రాంతాలకు అధికారులు, పోలీసులు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఉందని ఈ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.

అందుబాటులో ఉండని సిబ్బంది... సేవలందక ఇబ్బంది

ప్రజాశక్తి - సాలూరు

సామాన్య ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత అందుబాటులోకి తేవాలనే సంకల్పంతో గత ప్రభుత్వం ప్రతి 2వేల జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసింది. అన్ని రకాల సేవలు ఒకే వేదికపై అందించాలనే లక్ష్యంతో ప్రారంభమైన ఈ వ్యవస్థ నేడు పూర్తిగా పక్కదారి పట్టింది. ఎక్కడ చూసినా సిబ్బంది సమయపాలన పాటించకపోవడం, ప్రజలకు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో ఈ సచివాలయాలు తమ లక్ష్యాన్ని చేరుకోవడంలో విఫలమవుతున్నాయనే విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి.

సాలూరు మున్సిపల్ పరిధిలోని 18 సచివాలయాల్లో సుమారు 184 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. అయినప్పటికీ చాలావరకు సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. తమ అవసరాల నిమిత్తం సచివాలయాలకు వెళ్లిన ప్రజలు ఏ సమయంలో సిబ్బంది ఎవరు వస్తారు, ఎవరు ఎప్పుడు వెళ్తారో అన్న గందరగోళంతో విసిగిపోయి, చివరికి సచివాలయాల వైపు చూడడమే మానేశారు. ఈ సచివాలయాలకు పట్టణ పరిధిలో శాశ్వత భవనాల్లేకపోవడంతో చాలా వరకు ఇరుకు సందుల్లోని చిన్నపాటి గదుల్లోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. దీనికితోడు ఏ ఒక్క ఉన్నతాధికారి కూడా సచివాలయాలను తనిఖీ చేసి, ఉద్యోగుల సమయపాలనను పర్యవేక్షించిన దాఖలాల్లేవు. దీంతో ఇక్కడ పనిచేసే ఉద్యోగులు 'ఆడిందే ఆట, పాడిందే పాట' అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. వారికి నచ్చిన సమయానికి రావడం ఎవరైనా పనుల కోసం వస్తే 'సర్వే' పేరుతో వీధుల్లోకి వెళ్లారని చెప్పడం లేదా మున్సిపల్ కార్యాలయంలో పనిమీద వెళ్లారని చెప్పడం నిత్యకృత్యమైంది. కొన్ని సచివాలయాలలో అయితే షిఫ్టుల వారీగా కొందరు ఒక రోజు మరికొందరు మరో రోజు రావడం అలవాటుగా మారింది. . ఎవరైనా సేవలు కోరినప్పుడు అక్కడ ఉన్న ఒకరిద్దరు సిబ్బందిని అడిగితే తమకు ప్రభుత్వం నిరంతరం వివిధ రకాల సర్వేలు చేయమంటుందని, దాని నిమిత్తమే వీధుల్లోకి వెళ్తున్నామని అక్కడ ప్రజలు అందుబాటులో ఉండకపోతే వారి కోసం ఎదురుచూడాల్సి వస్తుందని ప్రజలనే ఎదురు ప్రశ్నిస్తున్నారు. ముఖ హాజరు వేయడానికి ఉదయం 10 గంటలకు వచ్చి వెంటనే సొంత పనుల నిమిత్తం బయటకు వెళ్లిపోవడం సాయంత్రం తిరిగి మరొకసారి హాజరు వేయడానికి రావడం అనేది దాదాపు ప్రతి సచివాలయంలోనూ జరుగుతున్న తంతు. దీనిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడటంతో ఉద్యోగులు స్వతంత్ర అధికారులుగా వ్యవహరిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.



సచివాలయ సిబ్బంది కోసం నిరీక్షిస్తున్న 23వ వార్డు ప్రజలు

మంత్రి వార్డులోనూ ఇదే దుస్థితి

సాక్షాత్తు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి నివాసం ఉంటున్న 23వ వార్డులో కూడా పరిస్థితి కూడా ఇలాగేవుంది. వివిధ పనుల నిమిత్తం సుమారు 20 మంది ప్రజలు ఉదయం 11:30 గంటలకు సచివాలయానికి వస్తే కనీసం ఒక్క ఉద్యోగి కూడా అందుబాటులో లేకపోవడం ఇక్కడి నిర్లక్ష్యానికి నిదర్శనం. ప్రజలు చేసేదేమీ లేక వారు ఎప్పుడొస్తే అప్పుడు పనులు చేయించుకుందామని నిరీక్షించడం చాలా బాధాకరమైన విషయం. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, మున్సిపల్ పరిధిలోని అన్ని సచివాలయాల్లో సిబ్బంది విధిగా సమయపాలన పాటించేలా ప్రజలకు సకాలంలో ప్రభుత్వ సేవలు అందించేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నిర్దేశిత గడువులోగా రీసర్వే పూర్తి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని రెవెన్యూ అధికారులు కోరిన గడువు మేరకు లక్ష్యాలను నిర్దేశించడం జరిగిందని, ఈలోగా రీసర్వే పనులు పూర్తిచేసి కచ్చితంగా ప్రగతిని సాధించాలని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి స్పష్టం చేశారు. అయినప్పటికీ ప్రగతిని సాధించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలతతో కలిసి రెవెన్యూ అంశాలపై రెవెన్యూ, సర్వే అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులు, రహదారులు ఆక్రమణదారులపై విధానపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మండల కేంద్రాల్లో తహశీల్దారులు మేజిస్ట్రేట్లన్న సంగతిని గుర్తెరగాలని, అందుకు తగిన విధంగా తహశీల్దార్ల చాంబర్లు, కార్యాలయాలు ఉండాలని అన్నారు. ప్రతి కార్యాలయానికి కనీస మౌలిక వసతులు ఉండాలని, పాత ఫైళ్లను డిస్పోజల్ చేయించాలని పేర్కొన్నారు. సబ్ కలెక్టర్లు మండలాల్లో పర్యటిస్తూ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛంధ్రా - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఆ స్ఫూర్తితో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతను ఇస్తూ ప్రతి రోజూ పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీలో నిర్దిష్టత పనికిరాదని, వీలైనంత త్వరగా వాటిని మంజూరు చేసేలా అధికారులు చొరవ తీసుకోవాలని అన్నారు. జిల్లాలో ఎంఎస్ఎంఇల ఏర్పాటుకు స్థల సేకరణ చేయాల్సి ఉందని, అందుకు తగిన విధంగా స్థలాలను గుర్తించాలని పేర్కొన్నారు. డిసెంబర్ 15 నాటికి ఇళ్లకు సంబంధించిన ఫ్రీ వెరిఫికేషన్ పూర్తిచేసి, జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. సకాలంలో నీటిపన్నులను వసూలు చేయాలని, రెవెన్యూ అంశాలను తక్షణమే పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో సబ్ కలెక్టర్లు ఆర్. వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ప్రత్యేక ఉప కలెక్టర్లు పి.దర్మచంద్రారెడ్డి, ఎస్.దిలీప్ చక్రవర్తి, జిల్లా సర్వే భూరికార్డుల అధికారి వై.లక్ష్మణరావు, తహశీల్దార్లు, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు, రైతు సంఘ నాయకులు

రైతు సేవా కేంద్రాల ద్వారా తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి లక్ష్ము నాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులు వరి కోతలు పూర్తి చేసి ధాన్యం తయారయ్యాయని, కొన్నిచోట్ల కొనుగోలు కేంద్రాలు తెరిచినప్పటికీ మరికొన్నిచోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదని అన్నారు. రైతులకు (గన్ని బ్యాగులు) గోనె సంచులు ఎక్కడా పూర్తిస్థాయిలో ఇవ్వలేదన్నారు. మండలంలో యంత్రాల ద్వారా తయారైన ధాన్యం దళారులకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు లేక, అతి తక్కువ ధరకు 100 కేజీల బస్తా రూ,1400 నుంచి రూ.1700కు అమ్ముకోవాల్సి వచ్చింది. రైతు పెట్టుబడి కూడా రావడం లేదు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ,2369 గా ప్రకటించిందని, అందుకు అనుగుణంగా ఎక్కడా కొనుగోలు చేయడం లేదని, దళారులు రైతులను నిలువునా మోసగిస్తున్నారని అన్నారు. కావున ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలంలో రైతుల వద్ద నిల్వ ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బి.అప్పారావు, ఉపాధ్యక్షులు చిట్టి సూర్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి రమణమూర్తి, సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ, రైతులు బల్ల నారాయణస్వామి, మూడడ్ల రాఘవ, రెడ్డి సింహాచలం, చంద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన పెండింగ్ కేసులు పూర్తి : ఎస్పి

జిల్లా పోలీస్ అధికారులతో నేర సమీక్షా సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ప్లాన్ ఆఫ్ యాక్షన్, క్వాలిటీ ఇన్వెస్టిగేషన్, సాంకేతిక పరిజ్ఞానంతో పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్పి ఎస్వి మాధవరెడ్డి పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక జిల్లా పోలీస్ అధికారులతో , స్టేషన్ రైటర్లతో పోలీస్ కాన్ఫరెన్సు హాలులో నెలవారీ నేర సమీక్ష సమావేశం జరిగింది. శాంతిభద్రతల పరిరక్షణ చర్యలు, వివిధ కేసులపై జిల్లా పోలీస్ అధికారుల ద్వారా సమాచారాన్ని సేకరించి తగిన సూచనలు, సలహాలు, మెలకువలను తెలిపారు. ఎన్ డి ప

ప్రజాశక్తి
www.prajasakti.com

27 నుంచి విభిన్న ప్రతిభావంతులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు ఈనెల 27 ఉదయం 9గంటలకు స్థానిక డిగ్రీ కాలేజీ మైదానంలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి డాక్టర్ కె.శ్రీధరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో బాలురు, బాలికలు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విభిన్న ప్రతిభావంతులు వారి గుర్తింపు కార్డుతో పార్వతీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం వద్దకు ఉదయం 9 గంటలకు రావాల్సిందిగా కోరారు. అథ్లెటిక్స్ విభాగంలో 50మీటర్ల రన్, షాట్‌పుట్, జావిలిన్‌త్రో, డిస్కస్‌త్రో, వీల్‌చైర్ రన్, అర్చరీ (30 మీటర్ల కాంపౌండ్), బ్యాడ్మింటన్ (సింగల్స్, డబుల్స్), పవర్ లిఫ్టింగ్ పైన పేర్కొన్న పోటీలకు హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు కె.గణేష్ హ్యాండ్ బాల్ కోచ్. ఫోన్ నెంబర్ 9866805716 కు సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

ఆస్పత్రిని పరిశీలించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో మందులు వచ్చిన కేసులు లేబర్ రూములో పరిశీలించారు. కుక్క, పాము కాటుకు వ్యాక్సిలేషన్ ఉందా అని అడగ్గా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మలేరియా, డెంగీ వ్యాధుల నివారణ మందుల కోసం కూడా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి పి.ఉషారాణి, సిహెచ్ఒ ఎస్వి రమణ, యుడిసి మురళి, వైద్య సిబ్బంది ఉన్నారు.

డిపో వద్ద నిరసన తెలుపుతున్న ఎన్‌డబ్ల్యుఎఫ్ నాయకులు

అక్రమ సస్పెన్షన్ ఎత్తివేసి విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఏలూరు ఔట్ లెట్ పెట్రోల్ బంక్‌లో జరిగిన అవినీతిలో సంబంధం లేనప్పటికీ ఎస్‌బ్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ సుందరయ్య అక్రమ సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేసి విధుల్లోకి తీసుకోవాలని, అలాగే అక్రమంగా సస్పెండ్ చేసిన మరో ఇద్దరి సస్పెన్షన్ రద్దు చేయాలని, సమగ్ర విచారణ జరిపించి అసలైన దోషులను శిక్షించాలని, అవినీతికి అధికారులే బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఎస్ఎస్ రావు అధ్యక్షతన ధర్నా జరిగింది. ఈ ధర్నాను ఉద్దేశించి డిపో కార్యదర్శి ఎఎస్‌టి బాబు, రాష్ట్ర కార్యదర్శి వి.రాములు, సిఐటియు జిల్లా కార్యదర్శి యమ్మల మన్మధరావు మాట్లాడారు. కార్యక్రమంలో డిపో జాయింట్ కార్యదర్శి, ఎస్‌వి రమణ, డిపో గౌరవాధ్యక్షులు కెఇ నాయుడు, డిపో నాయకులు జిఎస్ రావు, పి.రాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా గౌరవ అధ్యక్షుడు రెడ్డి వేణు, సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, జి .వెంకట రమణ పాల్గొని మద్దతు తెలియజేశారు.

పచ్చదనం పరిశుభ్రత పై శిక్షణ

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 26న పచ్చదనం పరిశుభ్రతపై శిక్షణా తరగతి నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ బి.వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025- 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి థీమ్ 5 పచ్చదనం పరిశుభ్రత అంశంపై ఒక్కరోజు శిక్షణ తరగతిలో భాగంగా గ్రామపంచాయతీలకు చెందిన ఇద్దరు, ఎస్‌హెచ్ గ్రూపులకు సంబంధించి పంచాయతీకి ఇద్దరు, విఒఎ, గ్రామ మహిళా సమాఖ్య అధ్యక్షులు ఉదయం 9:30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించే శిక్షణ తరగతులకు తప్పనిసరిగా హాజరుకావాలని, కోరారు.

రూ.83.95కోట్లుతో వార్షిక అంచనా బడ్జెట్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

2026- 27 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదిత అంచనా బడ్జెట్‌ను ఎంపిపి కె.దీనమయ్య అధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పలువురు ఎంపిటిసిలు, సర్పంచుల సమక్షంలో రూపొందించారు. ఈ మేరకు సాధారణ విద్య, క్రీడలకు సంబంధించిన అవసరాలకు రూ.2 కోట్ల 23 లక్షలు, సామాజిక భద్రత, సంక్షేమానికి సంబంధించి రూ.29 కోట్ల 75 లక్షలు, ఇతర సాంఘిక సర్వీసులకు రూ.4,40,000, గ్రామీణ ఉపాధి కార్యక్రమానికి రూ.28 కోట్ల 25 లక్షలు, ఇతర గ్రామీణ కార్యక్రమాలకు రూ.6లక్షలు, సహాయక గ్రాంటు, విరాళాలకు రూ.3.10కోట్లు చొప్పున మొత్తం అంచనా బడ్జెట్ రూ. 83,95,76000 అంచనా బడ్జెట్ రూపొందించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఐవి లక్ష్మి, వైస్ ఎంపిపిలు ఎన్.శేఖర్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఏనుగులవాడలో చేపడుతున్న పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని ఏగులువాడలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను మంగళవారం ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రజల సహకారం అత్యవసరమని, ప్రతి ఇంటి ముందు పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులు, దోమల పెరుగుదల వంటి సమస్యలను నివారించవచ్చని అన్నారు. కావున ప్రతి ఒక్కరూ వారి ఇంటి పరిసరాలతో పాటు పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.అలివేలు, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఫైలేరియా రోగులకు చెప్పులు పంపిణీ

ప్రజాశక్తి - బలిజిపేట

హిందూస్తాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ సహకారంతో లెప్రా సొసైటీ ఆధ్వర్యంలో 132మంది ఫైలేరియా బాధితులకు ఇవా చెప్పులు, సెల్ఫ్ కేర్ కిట్లను హిందూస్తాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ సీనియర్ మేనేజర్ అనిల్ అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరైన జిల్లా మలేరియా అధికారి వై.మణి మాట్లాడుతూ స్వయంసంరక్షణ పద్ధతులు పాటించడం ద్వార బోధవ్యాధి తీవ్రత తగ్గించవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా బలిజిపేట పిహెచ్‌సి వైద్యాధికారి క్రాంతికిరణ్మయి మాట్లాడుతూ వ్యాధి తీవ్రత తగ్గించడానికి కాలును మంచి నీటితో, సబ్బుతో శుభ్రం చేసుకోడం, క్రమం తప్పకుండ వ్యాయామం చేయడం, కాలును ఎత్తులో ఉంచుకోవటం, గాయాలను సంరక్షంచుకోవడం, ఇవా చెప్పులు వాడడం ద్వారా బోధవ్యాధి తీవ్రత తగ్గించుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో హిందూస్తాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ హెచ్‌ఆర్ మేనేజర్ సంతోష్ కుమార్, గ్రామ సర్పంచ్ నగరి పాపారావు, టిడిపి నాయకులు పెంకి వేణుగోపాలనాయుడు, లెప్రా సొసైటీ ప్రతినిధులు స్వామి రెడ్డి, లెంక రమణ, లావణ్య గ్రామ పెద్దలు ఫకీరునాయుడు, మాజీ సర్పంచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

పైలేరియా రోగికి చెప్పలను అందజేస్తున్న హిందుస్థాన్ షిప్‌యార్డు మేనేజర్

కానరాని కొనుగోలు కేంద్రాలు

- ఎక్కడికక్కడ ధాన్యం నిల్వలు
- అన్నదాతల శ్రమ దళారుల పాలు
- ఇదీ వీరఘట్టం మండలంలో ధాన్యం కొనుగోలు దుస్థితి

ప్రజాశక్తి - వీరఘట్టం

విత్తనాలు వేసినప్పటి నుంచి పంట నూర్పుకు వచ్చేంత వరకు ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ఆరుగాలం ఎంతో కష్టించి శ్రమించి పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేయడానికి ముందుకు రాకపోవడంతో ఎక్కడి ధాన్యం నిల్వలు అక్కడే దర్శనమిస్తున్నాయి. మండలంలోని ఈ ఏడాది దాదాపుగా 11 వేలపైచిలుక చిన్న, సన్నకారు రైతులు సుమారు 17,200 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. వీరు నుండి ధాన్యం కొనుగోలు చేసేందుకు 19 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, అందుకు తగ్గసిబ్బందిని కూడా నియమించినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే నూర్పు చేసి పది రోజులు కావస్తున్నా మండలం ఇప్పటికీ ఎక్కడా కొనుగోలు కేంద్రం ప్రారంభించలేదు. దీంతో మండలంలోని నడుకూరు, విక్రంపురం, యు వెంకంపేట, పనస నందివాడ, నీలానగరం, ఎంవి పురం తదితర గ్రామాల్లో ధాన్యం బస్తాలు కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి. వేలాది రూపాయలు పెట్టుబడిపెట్టి పంటలు సాగు చేసినప్పటికీ ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కళ్లాలోనే తూనికలు

ప్రభుత్వం ఎ- గ్రేడ్ రకం రూ2,389, సాధారణ రకం రూ.2,369కు ధరలు ప్రకటించినప్పటికీ కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం కొనుగోలు లేక ఇదే అదును చూసిన దళారులు దోపిడీకి పాల్పడుతున్నారు. దళారులు 84 కేజీల బస్తా రూ.1,720 నుంచి రూ.1,760ల చొప్పున కొనుగోలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ ఏడాది పంట దిగుబడి బాగా ఉన్నప్పటికీ అందుకు తగ్గ ధర లేకపోవడంతో పడిన శ్రమ అంత దళారుల పాలవుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో 82 కేజీలు బస్తా రూ.1,340, నుంచి 1,370 చొప్పున దళారులకు విక్రయాలు జరిపి నిలువునా మోసగిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ప్రతిసారి సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం వల్ల తమ కష్టార్జితమంతా దళారులపాలవుతుందని రైతులు ఆవాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి పంటకు తగ్గ కనీస మద్దతు ధర కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నీలానగరం రహదారిలో కుప్పలు తెప్పలుగా ఉన్న ధాన్యం బస్తాలు

ఈ విషయమై స్థానిక మండల వ్యవసాయ అధికారి జె.సౌజన్య వద్ద ప్రజాశక్తి ప్రస్తావించగా మిల్లర్లకు రెండు, మూడు రోజుల్లో బ్యాంకు గ్యారంటీలు లభిస్తాయన్నారు. ధాన్యం విక్రయాలు జరపాలంటే బలిజిపేట, గరుగుబిల్లి మండలాలకు తరలించవచ్చునని ఆమె వివరణ ఇచ్చారు.

ధాన్యం కొనుగోలు లేక నిల్వలు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ కొనుగోలు చేసేందుకు అధికారులు ముందుకు రాకపోవడంతో నిల్వలు ఉంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం వాతావరణంలో మార్పు రావడంతో భయాందోళనకు గురికావాల్సి వస్తుంది. తక్షణమే అధికారులు చర్యలు తీసుకుని ధాన్యాన్ని కొనుగోలు చేయాలి.

ఎం.శ్రీను, రైతు, నడుకూరు.

మహిళలపై హింసను అరికట్టాలి : ఐద్వా

ప్రజాశక్తి - పార్వతీపురం

మహిళలపై హింసా ధోరణిని అరికట్టాలని ఐద్వా జిల్లా కార్యదర్శి బి.లక్ష్మి పిలుపునిచ్చారు. మహిళలు-బాలికలపై హింస వ్యతిరేక దినం సందర్భంగా మంగళవారం స్థానిక వేదాంత కళాశాలలో విద్యార్థినులతో ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ సమాజంలో రోజురోజుకూ మహిళల పట్ల హింసా ధోరణి పెరగడం విచారకరమని అన్నారు. దేశంలో ప్రతి ముగ్గురిలో ఒకరు హింసకు గురవుతున్నట్లు నివేదికలు తెలియజేస్తున్నాయంటే ఎంత ఆందోళనకర పరిస్థితులు దేశంలో నెలకొన్నాయో అర్థమవుతుందని అన్నారు. మహిళలపై శారీరక, మానసిక, ఆర్థిక హింసతో పాటు ఇటీవల డిజిటల్ హింస కూడా పెరిగిపోయిందని సోషల్ మీడియాలో మహిళల పట్ల వేధింపులు కూడా పెరిగాయని తెలిపారు. ఈ ధోరణి నివారించేందుకు ప్రభుత్వాలు స్పష్టమైన విధానాన్ని రూపొందించి మహిళలు బాలికల రక్షణకై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యార్థినులు బాగా విద్యను అభ్యసించి, సామాజిక స్పృహ పెంపొందించుకొని ఇలాంటి పెడధోరణులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి అయితే ఇలాంటి హింసా పోకడల నుంచి బయట పడవచ్చని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు ఎం.గౌరి, ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ ఇందు, తదితరులు పాల్గొన్నారు.

సాలూరులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు, ఐద్వా నాయకులు

ఐద్వా ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

సాలూరు : రాష్ట్రంలో బాలికలు, మహిళలను కాపాడడంలో కఠిన చట్టాలు ప్రభుత్వాలు అమలు చేయాలని ఐద్వా డిమాండ్ చేసింది. మహిళలు, బాలికలపై హింస వ్యతిరేక దినం సందర్భంగా ఐద్వా ఆధ్వర్యంలో పట్టణంలోనికొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐద్వా నాయకులు కె.రాణి, కౌసల్య మాట్లాడుతూ సమాజంలో రోజురోజుకు బాలికలు, మహిళ పట్ల హింస పెరిగిపోవడం ప్రమాదానికి సంకేతమని ఈ పరిస్థితులు మారేలా ప్రభుత్వాలు కఠిన చట్టాలు అమలు చేయాలని, ప్రస్తుతం ఉన్న చట్టాలు కొండకు కన్నం పడ్డట్టుగా ఉన్నాయన్నారు. పని ప్రదేశాల్లో, చదువుకున్న చోట పనిచేస్తున్న చోట, నిరంతరం వేధింపులకు మహిళలు గురవుతూనే ఉన్నారని, వీరందరికీ రక్షణ కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా సాలూరు కమిటీ నాయకులు స్వప్న, దేవి పాల్గొన్నారు.

విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి లక్ష్మి

వీరఘట్టం : సమాజంలో రోజురోజుకు మహిళలు, చిన్నారులపై పెరుగుతున్న హింసను అరికట్టేందుకు పాలకులు చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేయడంతో పాటు మహిళా ప్రజా సంఘాలు సమైక్య ఉద్యమాలు చేయాలని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక శ్రీ గాయత్రి కళాశాలలో అంతర్జాతీయ హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. మహిళలు ప్రతిచోటా ఏదో రకమైన హింసకు, అకృత్యాలకు, అవమానులకు, తీవ్ర దూషణలకు, హత్యలకు గురవుతున్నారనిఅన్నారు. లైంగిక జరుగుతున్న హింసను అరికట్టేందుకు సమాజంలో అవగాహన చైతన్యం కల్పించేందుకు ఈనెల 25న ఐక్యరాజ్యసమితి స్త్రీల హక్కుల పరిరక్షణ స్త్రీలపై జరుగుతున్న హింస వ్యతిరేక దినంగా ప్రకటించిందని ఆమె తెలిపారు. స్థానిక ఎస్సై ఎం.హేమలత మాట్లాడుతూ మీ గ్రామంలో ఏం జరుగుతున్నా మీ ఉపాధ్యాయులకు లేదా పోలీస్ స్టేషన్ కు తక్షణమే సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎస్ లోకేష్, ఎన్.సింహాచలం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కేంద్ర మోడల్ అధికారి పర్యటన

ప్రజాశక్తి - సీతంపేట

ఆస్పిరేషన్ బ్లాక్ ప్రోగ్రాం కింద బుధవారం ఢిల్లీ నుంచి సెంట్రల్ నోడల్ ఆఫీసర్ సుజాత శర్మ సీతంపేట ఐటిడిఎలో పర్యటించనున్నారని పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పర్యటనలో గోరపాడు, మోహన్ కాలనీ గ్రామాల్లో హార్టికల్చర్‌కు సంబంధించిన జీడి, పైనాపిల్ (మారిసస్ వెరైటీ) పంటలను పరిశీలించనున్నారు. హడ్డుబంగి బాలికల ఆశ్రమ పాఠశాలను పరిశీలించనున్నారు. జిల్లా అధికారులతో పిఒ ఛాంబర్లో అంతర్గత సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం భామిని మండలం మనుమకొండ, బొడ్డగూడ, బత్తిలి పిహెచ్‌సిలను పరిశీలించనున్నారు.

పార్క్ షాపులో చోరీ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్క్‌లో ఉన్న షాప్‌లో సోమవారం రాత్రి చోరీ జరిగిందని యజమాని ఎస్.శివ తెలిపారు. సిసి కెమెరా తొలగించి వెనుక నుంచి రేకు తీసి సూమారు రూ.15వేలు ఐస్ క్రీమ్‌లు, బిస్కెట్స్ చిల్లర వస్తువులు చోరీ చేశారని శివ తెలిపారు.

27న మన్యంలో కాంగ్రెస్ పరిశీలకుల పర్యటన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 27న జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పరిశీలకుల బృందం పర్యటిస్తుందని కురుపాం నియోజకవర్గ కాంగ్రెస్ కోఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు తెలిపారు. గుమ్మలక్ష్మీపురంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో కాంగ్రెస్‌ను పునరుజ్జీవింపజేసేందుకు ఎఐసిసి పరిశీలకులు అబ్జర్వర్ దేబాసిస్ పట్నాయక్ (ఎంఎల్ఎ) న్యూ ఢిల్లీ, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇన్చార్జిలు జగత శ్రీనివాస్, కామన ప్రభాకర్, వేగి వెంకటేష్, అరకు పార్లమెంట్ అధ్యక్షులు శతాక బుల్లిబాబు వస్తున్నారని అన్నారు. ముఖ్య నాయకులు, కార్యకర్తలతో చర్చించి, పార్టీ బలోపేతానికి చేపట్టబోయే అంశాలపై దిశా నిర్దేశం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కావున ఐదు మండలాల్లోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రావాలని కోరారు. ఈ సమావేశంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు ఎం.ఫ్రాన్సిస్, కోలక జయరాం ఉన్నారు.

28న నియోజకవర్గ కాంగ్రెస్ సమావేశం

సాలూరు: ఈనెల 28న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ సమన్వయకర్త గేదెల రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎఐసిసి పరిశీలకులు దేబాసిస్ పట్నాయక్ ఈ సమావేశానికి హాజరు కానున్నారని చెప్పారు. పట్టణంలోని శ్రీ సీతారామ కళ్యాణమండపంలో ఉదయం పది గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని చెప్పారు. రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షులు నేమన ప్రభాకర్, పిసిసి సభ్యులు వేగి వెంకటేష్, జగతి శ్రీనివాస్ హాజరవుతారని చెప్పారు. కావున ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని రామకృష్ణ ఆ ప్రకటనలో కోరారు.

డాక్టర్ కోడూరుకు 'శ్రీశ్రీ కళావేదిక' పురస్కారం

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కోడూరు సాయి శ్రీనివాసరావుకు అరుదైన గౌరవం దక్కింది. తెలుగు సాహిత్యంపై ఆయనకున్న మక్కువ, కృషికి గుర్తింపుగా 'శ్రీశ్రీ కళావేదిక' సంస్థ ఆయనకు పురస్కారాన్ని ప్రకటించింది. 36 ప్రపంచ రికార్డులను సాధించిన అతిపెద్ద సాహితీ సంస్థ అయిన శ్రీశ్రీ కళావేదిక ఇటీవల "అపూర్వ బాల్యం" అనే అంశంపై తూర్పు గోదావరి జిల్లా సఖినేటి పల్లిలో నిర్వహించిన కవితల పోటీని నిర్వహించింది. ఈ పోటీలో డాక్టర్ కోడూరు సాయి శ్రీనివాసరావు రాసిన కవిత టాప్ 10 కవితల్లో ఒకటిగా నిలిచి, ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ కళావేదిక చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షులు జి. ఈశ్వరం భూషణం, జాతీయ మీడియా ఇన్‌ఛార్జి నల్ల భాగ్యలక్ష్మికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించిన డైట్ విద్యార్థులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని సీతానగరం క్లస్టర్ పరిధిలో కాశీపేట ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి చదువుతున్న విద్యార్థుల బేస్ లెవెల్ అకాడమీ పరీక్షల్లో సామర్థ్యం తెలుసుకునేందుకు డైట్ విద్యార్థులు పరీక్షలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ పరిశీలన ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో డైట్ కళాశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయులు కె.అన్నోజీ రావు ఎంఇఒలు జి.సూర్యదేముడు, ఎం.వెంకటరమణ, సిఆర్‌పిలు దామోదర అనసూయ, రమేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని పెదఖర్జలో మంగళవారం నిర్వహించిన రైతన్న! మీ కోసం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రైతు సంక్షేమం, అభివృద్ధి కోసం వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇంటింటికి వెళ్ళి రైతుల కోసం చేపట్టిన కార్యక్రమాలు, భవిష్యత్తులో ఏం చేయబోతుందనే అంశాలను రైతులకు వివరించారు. రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందన్నారు. సూపర్ సిక్స్ హామీలో భాగంగా అన్నదాత సుఖీభవ రెండు విడతలుగా రూ.14వేలు రైతులు ఖాతాలో జమ చేసిన ఘనత మన సీఎం చంద్రబాబుదే నని అన్నారు. రైతులంతా ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. ఇ-క్రాప్ చేసుకోవాలని తెలిపారు. అనంతరం వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన మినుము విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. రోడ్డు సౌకర్యం కల్పించాలని, చెక్ డ్యామ్ నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. పిఎండిఎస్ నవధాన్యాల సాగు అవగాహన కోసం ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించి, వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్పర్సన్ కడ్రక కళావతి, మండల టిడిపి అధ్యక్షులు అడ్డాకుల నరేష్, కూటమి నాయకులు నిమ్మక సింహాచలం, మండంగి భూషణరావు, వెంపటాపు భారతమ్మ, పిఎఒ పల్లేరిక శంకర్రావు, డుమ్మంగి సర్పంచ్ పాలక క్రాంతి కుమార్, స్థానిక సర్పంచ్ మండంగి మల్లేష్, పశు వైద్యులు పి లక్ష్మణరావు, కడ్రక అప్పలస్వామి, పాడి సుదర్శన్ రావు, కూటమి కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు మినుము విత్తనాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

నియోజకవర్గాన్ని జనరల్ చేయాలి

ఎన్నికల సంఘానికి వినతి

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన నియోజకవర్గాన్ని జనరల్ నియోజకవర్గంగా మార్చాలని జనసేన నాయకులు రేగు మహేష్, రిపబ్లికన్ పార్టీ నాయకులు గొంప ప్రకాశరావు కోరారు. ఈ మేరకు మంగళవారం జనసేన నాయకులు రేగు మహేష్ ఢిల్లీలోని ఎన్నికల సంఘం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 74 ఏళ్లుగా నియోజకవర్గం ఎస్టీలకు రిజర్వ్ చేయడం వల్ల కనీస అభివృద్ధికి నోచుకోలేదని చెప్పారు. ఎన్నికైన ఎమ్మెల్యేల్లో ముగ్గురు మాత్రమే నిజమైన గిరిజనులు ఉన్నారని, మిగిలిన వారు నకిలీ గిరిజనులేనని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఎస్టీ నియోజకవర్గంగానే కొనసాగుతోందని తెలిపారు. సాలూరు మున్సిపాలిటీ, మండలం తోపాటు రామభద్రపురం మండలాన్ని కలిపి నియోజకవర్గాన్ని జనరల్ కేటగిరీకి రిజర్వ్ చేయాలని డిమాండ్ చేశారు. పాచిపెంట, మక్కువ, మెంటాడ మండలాలను ఎస్టీ నియోజకవర్గంగా చేయాలన్నారు. నియోజకవర్గంలో ఉన్న ఏకైక జూట్ మిల్లు మూతపడి నాలుగేళ్లు కావస్తోందని, సుమారు రెండు వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని చెప్పారు. మిల్లు తెరిపించడానికి పాలక పార్టీలు కృషి చేయడం లేదన్నారు. దీర్ఘ కాలంగా అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని రేగు మహేష్ చెప్పారు.

హత్యా నేరం కేసులో ఒకరికి జీవిత ఖైదు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పార్వతీపురం పట్టణ పోలీస్ స్టేషనులో 2019లో నమోదైన హత్యానేరం కేసులో నిందితుడు లంక కృష్ణ (33)కు రెండవ అదనపు జిల్లా కోర్ట్ జడ్జి ఎస్.దామోదరరావు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.1,400 జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు. పట్టణంలోని కొత్త వీధికి చెందిన సంబాన ఆదినారాయణను పట్టణానికి చెందిన నిందితుడు లంక కృష్ణ పాత కక్షలను మనసులో పెట్టుకుని దాడి చంపేశాడు. నిందితుడు పై నేరారోపణలు రుజువు కావడంతో సదరు నిందితుడుకి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

నయా చేతన్ జెండర్ పై ర్యాలీ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక హనుమాన్ జంక్షన్ నుంచి బజార్ వరకు నైస్ చేతన్ జెండర్‌పై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎం భారతి మాట్లాడుతూ స్త్రీ, పురుషులు సమానత్వం ఉండాలని, మహిళలపై లైంగిక దాడులు జర